క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో మాజీ కౌన్సిలర్ వేణుకుమార్‌గౌడ్

పహాడీషరీఫ్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మామిడిపల్లి మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణుకుమార్‌గౌడ్ అన్నారు. రంగ నాయకుల కాలనీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు మానసికోల్లాసం పెరుగుతుందన్నారు. స్పోర్ట్స్‌లో రాణించడం ద్వారా కూడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. క్రీడల పట్ల మక్కువ ఉన్న వారిని ప్రభుత్వాలు వెన్నుతట్టి ప్రోత్సహించాలని కోరారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

పహాడీషరీఫ్: ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంచుతాయని ఎడ్ల వాసుదేవారెడ్డి, పెరమోని నరేశ్ అన్నారు. ఆదివారం మామిడిపల్లిలో మహ్మదియా మసీదులో వారు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మసీదు ముతవల్లీ అలీ తుర్కీ, అడ్వకేట్ నయీమ్, సయీద్ జాన్, గణేశ్‌గౌడ్, క్లాం నరేశ్‌గౌడ్, జాకేర్, అమేర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

కందుకూరు: ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ వి.రేవంత్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని అగర్‌మియాగూడలో ప్రీమియర్ లీగ్ సీజన్–8 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ప్రథమ స్థానంలో ధన్నారం తరుణ్‌రెడ్డి స్టార్స్ జట్టు, ద్వితీయ స్థానంలో అందె అజయ్‌యాదవ్ థండర్ జట్టు నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు వి.రేవంత్‌రెడ్డి రూ.30 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు లిక్కి జంగారెడ్డి రూ.15 వేల నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. క్రికెట్ పోటీలకు అవసరమైన వసతులు, ఇతర సౌకర్యాలను గోసుల కొండల్‌రెడ్డి, మున్నా, అందె ప్రవీణ్‌యాదవ్ అందించారు. కార్యక్రమంలో చింతకింద రవీందర్, నీరటి పాండు, ఢిల్లీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు రూ.3.24 కోట్ల ఆదాయం

చైర్‌పర్సన్ యాట గీత



ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీకి 2024– 25 ఆర్థిక సంవత్సరానికి రూ.3.24 కోట్ల ఆదాయం వచ్చిందని చైర్‌పర్సన్ యాటగీత తెలిపారు. ఈ ఏడాది లక్ష్యాన్ని మించి ఆదాయం సమకూరిందన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆదివారం వైస్ చైర్మన్ గూడురి భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆమె మాట్లాడారు. ఈ ఏడాది మార్కెట్‌కు సీసీఐ ద్వారా రూ.1.90 కోట్లు, వరిధాన్యం విక్రయంచడం ద్వారా రూ.34 లక్షలు, మిల్లర్లు ధాన్యం కొనుగోలు ద్వారా రూ.1 కోటి ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం, సిబ్బంది, అధికారుల సహకారంతో ఇది సాధ్యమైందని వెల్లడించారు. వచ్చే ఏడాది ఆదాయం మరింత పెరిగేలా దృష్టి సారించామని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద మరింత నిఘా పెడతామని, జీరో వ్యాపారానికి తావులేకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. దిగుబడిని దళారులకు విక్రయించకుండా వ్యవసాయ మార్కెట్‌యార్డులో విక్రయించి మద్దతుధర పొందాలని రైతులకు సూచించారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్లు కండె పాండురంగయ్య, వస్పుల శ్రీశైలం, అజీం, నరేశ్‌నాయక్, వెంకట్‌రెడ్డి, జంగయ్య, రమేశ్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, యాదయ్య, మార్కెట్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఈద్గాలో టెంట్లు వేస్తున్న సిబ్బంది



జల్‌పల్లి ఈద్గాలో చదును పనులు

నేడు ఈద్–ఉల్–ఫితర్

- నెల రోజుల ఉపవాస దీక్ష ముగింపు
- ఈద్గాలు, మసీదులు ముస్తాబు

పహాడీషరీఫ్: రంజాన్(ఈద్–ఉల్–ఫితర్)ను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. సోమవారం ఉదయం నుంచే నమాజ్ చేయనున్న నేపథ్యంలో ఈద్గాలు, మజీద్‌లను జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈద్గాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. టెంట్లు, విద్యుత్ సదుపాయం కల్పించారు. వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. జల్‌పల్లి, వాదే ముస్తఫా, కొత్తపేట, పహాడీషరీఫ్ ఈద్గాలను మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్ పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

పోలీసుల ప్రత్యేక నిఘా..

ఈద్గాలలో వేలాది మంది ముస్లింలు ప్రార్థనలు చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఇదే విషయమై రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డిలు బందోబస్తును పర్యవేక్షించి, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రధానమైన పహాడీషరీఫ్, కొత్తపేట, వాదే ముస్తఫా ఈద్గాలను మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, పహాడీషరీఫ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, సుధాకర్‌లు మత పెద్దలతో సమావేశమయ్యారు. ఉపవాస దీక్షలు చివరి రోజు కావడంతో దుకాణాలు కిటకిటలాడాయి. ముస్లింలు భారీగా షాపింగ్ చేశారు. దీంతో ప్రధాన రహదారుల్లో సందడి కనిపించింది. చివరి రోజు ఇఫ్తార్ విందులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

దైవ సన్నిధిలో



నెలరోజుల పాటు నియమ నిష్టలతో రంజాన్ ఉపవాస దీక్షలను కొనసాగించాం. పండుగ రోజు(సోమవారం)న ఉదయమే ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేస్తాం. అనంతరం పెద్దల ఆశీస్సులు తీసుకుంటాం. 30 రోజులు అల్లాహ్ నామస్మరణతో గడపడం ద్వారా సన్మార్గంలో నడవడం, ఉపవాస దీక్షల ద్వారా ఆరోగ్యానికి కూడా మేలు చేకూరుతుంది. ఈ మాసంలో ఉన్నంతలో దాన ధర్మాలు చేస్తాం.

– సయ్యద్ అబ్దుల్ రవూఫ్, షాహిన్‌నగర్

వెండి నాగాభరణం బహూకరణ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి బాలాపూర్‌లో ప్రసిద్ధి చెందిన శివాలయానికి అదే గ్రామానికి చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జయమ్మ దంపతులు 1.255 కిలోల(రూ.1.43లక్షలు) కలిగిన వెండి నాగాభరణాన్ని కానుకగా ఆదివారం అందజేశారు. దాతతో పాటు వారి కుమారులు శివకాంత్‌రెడ్డి, స్వాతి, ఓంకాశీరెడ్డి, శ్రీజ దంపతులు శివుడికి అభిషేకం నిర్వహించి ఆలయ కమిటీ సభ్యులకు నాగాభరణం అందజేశారు. చాలా రోజుల నుంచి శివుడిని నమ్ముకున్నామని, అంతా మంచే జరుగుతుందని పేర్కొన్నారు. ఇంతుకు గాను తమ కానుకగా నాగాభరణం అందిస్తున్నామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర జైహింద్‌కుమార్, శివాలయ కమిటీ చైర్మన్ క్లాం శశిధర్‌రెడ్డి, అర్చకుడు దుర్గాప్రసాద్, ఆలయ కమిటీ డైరెక్టర్లు ఎక్క మాధవి శ్రీనివాస్, పగడాల ఉమేశ్, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, వంగేటి సుధాకర్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, జుకంటి సురేశ్‌గౌడ్, ఎక్క శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



శివాలయానికి నాగాభరణం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

ప్రధాని 'మన్‌కీ బాత్'



ప్రసార కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కమలనాథులు

యాచారం: ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన 'మన్‌కి బాత్' 120 ప్రసార కార్యక్రమాన్ని ఆదివారం మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య నివాసంలో బీజేపీ శ్రేణులు వీక్షించారు. ఇందులో పార్టీ ఎస్సీమోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బాషా, యాచారం మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు పున్న శివకుమార్, గొరిగే బీరప్ప, వన్నెవాడ రవీందర్‌రెడ్డి, నీలం రమేష్, నడుకుడి కృష్ణ, పత్తి రాజు, పల్లపు నరేష్, కాలె శ్రీకాంత్, ముప్పిడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డికి శుభాకాంక్షలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉగాది పండుగను పురస్కరించుకుని రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకులు దెంది రాంరెడ్డి, కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, సంరెడ్డి మహిపాల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శివగౌడ్, ధనరాజ్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోమటిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రాజీవ్ యువ వికాసం గడువు పొడిగించాలి

నాగోలు: రాజీవ్ యువ వికాస పథకం గడువు పొడిగించాలని బీసీ హక్కుల సమితి రాష్ట్ర నాయకులు బొడ్డుపల్లి కృష్ణ ఓ ప్రకటనలో కోరారు. రాజీవ్ యువ వికాస పథకం, నిరుద్యోగ యువతి, యువకులకు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీలకు రూ.లక్ష నుంచి నాలుగు లక్షలు, సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేస్తామని ప్రకటించడం సంతోషదాయకమే అయినా ఈ యువ వికాస ఉపాధి పథకానికి అర్హులను ఎంపికలో కొన్ని నిబంధనలు పెట్టారని, వాటికి అనుగుణంగా సంబంధిత ధ్రువపత్రాలు జతపరచాలంటే ప్రభుత్వం ప్రకటించిన గడువు సరిపోదదన్నారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలు లక్షల మంది ఉన్నారని, రేషన్ కార్డు లేకుండా ఆయ ధ్రువపత్రాలు పొందాలంటే, రెవెన్యూ నిబంధనలు అంగికరించడం లేదన్నారు. రేషన్ కార్డులు ఇవ్వకుండా, ఆదాయ ధ్రువపత్రాలు అందకుండా రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవడం సాధ్యం కాదన్నారు.

బాల్యమిత్రుడికి ఆర్థికసాయం

మంచాల: అనారోగ్యంతో బాధపడుతున్న జాపాల గ్రామానికి చెందిన బాల్య మిత్రుడు యాట దశరథకు స్నేహితులు అండగా నిలిచారు. ఆదివారం 2002– 2003 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు.. బాధితుడికి రూ.60 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆసరాగా నిలిచిన మిత్రులకు దశరథ కృతజ్ఞతలు తెలిపారు.



దశరథకు నగదు అందిస్తున్న మిత్రులు

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థి దశ నుంచి సేవా గుణం అలవర్చుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ పేర్కొన్నారు. వారం రోజులుగా హైదరాబాద్ దోమలగూడలోని ఏవీ కళాశాల విద్యార్థులు నక్కలపల్లిలో వారంరోజుల పాటు ఎన్ఎస్ఎస్ వేసవి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఆదివారంతో ముగిసిన ఎన్ఎస్ఎస్ సభను ప్రోగ్రామ్ అధికారి అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరీ సతీశ్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడే విజ్ఞానం పెంపొందుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ అనేది విద్యార్థులకు ఒక చక్కటి అవకాశం అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. దేవాలయ ప్రాంగణం శుభ్రత, రోడ్లకు ఉన్న చెట్లకు పాదులు, విద్యా, ఉద్యోగం సంబంధిత ఇంటింటి సర్వే, సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించినందుకు అభినందించారు. అనంతరం ఎన్ఎస్ఎస్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నిరంజన్‌గౌడ్, నీలకంఠం, అంజయ్యగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజుగౌడ్, గ్రామస్తులు, యువకులు, నాయకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న గౌరీ సతీశ్

పుష్కరకాలం అయినా..

నాయిబ్రాహ్మణ సేవాసంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు ప్రారంభించి పుష్కర కాలం దాటింది. విడతలుగా నిధులు మంజూరు అయ్యాయి. అవి ఉన్నంత మేర పనులు జరిగాయి. అయినా భవనం అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. మరో రూ.10 లక్షలు అయితే కాని పనులు పూర్తికావని సంఘం నాయకులు పేర్కొంటున్నారు.

- పూర్తికాని కమ్యునిటీ హాల్ నిర్మాణ పనులు
- విడతలుగా నిధులు.. అయినా వీడని గ్రహణం



నిలిచిన నాయిబ్రాహ్మణ కమ్యునిటీ హాల్ నిర్మాణ పనులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో నాయిబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులు ప్రారంభమై సుమారు 14 ఏళ్లు దాటినా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణులు.. కమ్యూనిటీ హాల్ నిర్మించాలని అప్పట్లో ప్రజాప్రతినిధులను కోరారు. దీంతో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, నాటి ఆమనగల్లు సర్పంచ్ యాదయ్యలు 2011లో భవన నిర్మాణానికి 180 గజాల స్థలం కేటాయించారు.

మరో రూ.10లక్షలు అయితే కానీ..

నిర్మాణం కోసం జిల్లా పరిషత్ నిధుల నుంచి నాటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.3 లక్షలు మంజూరు చేయించారు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధులు ఉన్నంత మేరకు స్లాబు వేసి ఆపేశారు. అనంతరం 2015లో నాటి జెడ్పీటీసీ కండె హరిప్రసాద్ జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.1 లక్ష కేటాయించడంతో భవనంలో ఓ గది నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. నిధుల లేమితో నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుండటంతో మరిన్ని నిధులు కేటాయించాలని బ్రాహ్మణ సంఘం నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులకు ఆర్థిక సహాయం చేయాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని అభ్యర్థించగా రూ.3 లక్షలు అందజేశారు. దీంతో గోడలు, ఇతర పనులను పూర్తిచేశారు. అయినప్పటికీ మరో రూ.10లక్షలు అయితే కాని భవనం పూర్తి కాదని సంఘం నాయకులు పేర్కొంటున్నారు. అవసరమైన నిధులు మంజూరు చేసి, భవనాన్ని పూర్తి చేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలి. ఎవరూ పట్టించుకోకపోవడంతో చాలా ఆలస్యమైంది. ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి. భవనం వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– రమేశ్, నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు

ఘనంగా ఉగాది

మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రజలు నూతన సంవత్సరాది విశ్వావసు నామ ఉగాది పర్వదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కొత్త మట్టి కుండలు తీసుకొచ్చి షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేసి సేవించారు. ఒకరికొకరూ ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం గ్రామాల్లోని ఆలయాల్లో వేదపండితులు, అర్చకులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.



మహేశ్వరం: అమీర్‌పేట్‌లో గ్రామస్తులకు పంచాంగం చదివి వినిపిస్తున్న అర్చకులు



కందుకూరు: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



తుక్కుగూడ: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితులు



పహాడీషరీఫ్: మామిడిపల్లిలో పంచాంగం చదివి వినిపిస్తున్న అర్చకులు



మీర్‌పేట: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు రామాచారి

2న ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ ఆవరణలో ఏప్రిల్ 2న సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కొత్త మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో చూపు మందగించిన వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నేత్ర సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దాహార్తి తీర్చేందుకు దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సేవాసమితి సభ్యులు

సత్యసాయి సేవా సమితి చేవెళ్ల శాఖ కన్వీనర్ రామగౌడ్

చేవెళ్ల: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయని సత్యసాయి సేవా సమితి చేవెళ్ల శాఖ కన్వీనర్ రామగౌడ్ అన్నారు. మున్సిపాలిటీలోని బస్‌స్టేషన్ ఎదుట ఆదివారం సత్యసాయి సేవా సమితి చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మానవ సేవే మాధవ సేవ అని సత్యసాయి చూపించిన మార్గం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన చూపించిన మార్గంలోనే సేవా సమితి నడుస్తోందని చెప్పారు. వేసవి కాలం ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు గోపాలచారి, విజయ్‌భాస్కర్, దివాకర్‌రెడ్డి, వెంకటేశ్, అంజనేయులు, మధు, ప్రభు, విఠల్, దేవేంద్రచారి, శంకరయ్య, మాధవరెడ్డి, పెంటారెడ్డి తదితరులు ఉన్నారు.

సాయిరెడ్డి చెరువుకు మహర్దశ

- అభివృద్ధికి ముందుకొచ్చిన పలు ప్రైవేట్ సంస్థలు
- పెరగనున్న నీటి నిల్వ సామర్థ్యం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరుతండాలో ఉన్న సాయిరెడ్డి చెరువుకు మహర్దశ పట్టనుంది. ఈ చెరువును వ్యాపార దిగ్గజం అమెజాన్, స్థానిక పర్యావరణ సంస్థ సే ట్రీస్ నిర్వాహకులు అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చారు. ఇప్పటికే సంస్థల ప్రతినిధులు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్‌తో ఒప్పందం చేసుకొని అనుమతులు సైతం పొందినట్లు సమాచారం. చెరువులను కాపాడడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాలను పెంచడంతో భూగర్భ జలాల పెంపునకు సంస్థలు కృషి చేస్తున్నాయి.

రెండు రెట్లు ఎక్కువగా..

ప్రస్తుతం సాయిరెడ్డి చెరువు 10 ఎకరాల్లో విస్తరించి ఉంది. సంస్థలు నిర్వహించిన సర్వేలో నీటి నిల్వ సామర్థ్యం సుమారు 33 ఎకరాల వరకు ఉన్నట్లు గుర్తించారు. దీంతో పనులు ప్రారంభించి చెరువును అభివృద్ధి చేస్తే ప్రస్తుతం కంటే రెండు రెట్లు ఎక్కువగా నీరు నిల్వ ఉండనుంది. తద్వారా సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరగనున్నాయి. నీటి కొరతను రూపుమాపడానికి అమెజాన్ కృషి చేస్తున్నట్లు సంస్థ ఇండియా ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అభినవ్‌సింగ్ స్పష్టం చేశారు.